క్లుప్తంగా

విద్యార్థులకు కబడ్డీ పోటీలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల నిర్వహణలో భాగంగా శుక్రవారం శాఖ గ్రంథాలయాధికారి శెట్టి సునీత ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుతులు అందజేస్తామన్నారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులను విద్యా ర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రామన్న, నాయకులు

అరకులోయ రూరల్: అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని వైస్ ఎంపీపీ కిల్లో రామన్న అన్నారు. మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీల్లో చేపడుతున్న పనుల్లో సక్రమంగా వేతనాలు అందజేయాలని, తాగునీరు, టెంట్లు తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది పనులను పర్యవేక్షించాలన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ మజ్జి గురు, నాయకుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలకు డిమాండ్

చింతూరు: అడ్డతీగల మండలంలో ఆదివాసీలపై దాడిచేసిన గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్డతీగల మండలం వాల్మీకినగర్‌లో ఆదివాసీ మహిళ బాపనమ్మపై గిరిజనేతరులు దాడిచేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. ఆదివాసీ చట్టాలు పటిష్టంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని, దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన కోరారు. తమ్మయ్య, శ్రీను, బాలకృష్ణ, మల్లయ్య, రవి, నారాయణ పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి ఎదుట సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆస్పత్రిలోని పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీసం వేతనం రూ.20వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. నాయకులు రఘు, ద్రౌపది, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు



ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

యలమంచిలి : పీఎస్ఆర్‌పేట, పేట బయ్యవరం గ్రామాల్లో దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం కుంకుమ పూజలు జరిగాయి. పండితులు సోమయాజ శర్మ మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. శుక్రవారం ఉదయం పీఎస్ఆర్ పేట, పేటబయ్యవరం, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ములకలాపల్లి గ్రామానికి చెందిన మహిళల హరిభజన, గీతాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

22న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

పాయకరావుపేట : బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నక్కపల్లి మండలంలో గల డొంకాడ గ్రామంలో ఈ నెల 22వ తేదీన ఆవిష్కరించడం జరుగుతుందని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు తుమ్మలపల్లి కుమార్ తెలిపారు. కార్యక్రమానికి జగ్జీవన్‌రామ్ అభిమానులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన



గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



దారెలలో గ్రామస్తులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, విశాఖ ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

కొయ్యూరు: గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాడేరు ఎమ్మెల్యేకొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రాజేంద్రపాలెం పంచాయతీలో సోలాబు, జోగంపేట, కొత్తవీధి, సూరేంద్రపాలెం, రాజేంద్రపాలెంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని 130 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు కన్న నిజమైన స్వరాజ్యం మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారమైందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన చేరిందన్నారు. ప్రతీ 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించి వారి యోగ క్షేమాలను చూస్తున్నారనన్నారు. ఎలాంటి వివక్షకు తావు లేకుండా సుపరిపాలన సాగుతోందని స్పష్టం చేశారు. కొయ్యూరులో నిర్వహిస్తున్న బాలరేవుల, చీడిపల్లి డీఆర్ డిపోలను బాలరేవులకు తరలించాలని ఆమె తహశీల్దారు తిరుపతిరావును ఆదేశించారు. వచ్చే నెల నుంచి రేషన్ అక్కడే ఇవ్వాలన్నారు.విలేకరులు డిపోలు అక్కడ లేక ప్రజలు పడుతోన్న ఇబ్బందులు ఎమ్మెల్యే దృష్టిలో ఉంచడంతో ఆమె స్పందించి రహదారి సౌకర్యం ఉన్నందున డిపోలను మార్చాలని తెలిపారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, వైస్ ఎంపీపీలు నూకాలు, వెంకటరమణ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ముసిలినాయుడు,ఏఎంసీ చైర్మన్ జె రాజులమ్మ, ఎంపీటీసీ సభ్యులు మల్లేశ్వరి, బిడిజన అప్పారావు, సర్పంచ్‌లు చింతల్లి, అప్పారావు, చంద్రరావు, త్రినాథ్‌పడాల్, సోమన్నదొర, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సూరిబాబు, ప్రచార కమిటీ అధ్యక్షుడు బాబ్జీ, నేతలు శేఖర్, శ్రీను, గంగాధర్, అచ్యుత్, నరసింహులు, సచివాలయ కన్వీనర్ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన

ముంచంగిపుట్టు: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ప్రజా సంక్షేమ పాలన సాగుతోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని దారెల పంచాయతీ కేంద్రంతో పాటు చికుచింత గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాల్గుణ, విశాఖ ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో ఆయా గ్రామాల్లో 168 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేసి ప్రభుత్వం నుంచి పొందిన పథకాలను వివరించారు. గ్రామాల్లో గిరిజనులంతా ఎమ్మెల్యే పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్రకు ఘనంగా స్వాగతం పలికారు. ప్రస్తుతం నేరుగా ఇంటికే పథకాలు అందుతున్నాయని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు గడప వద్దకే అందుతున్నాయని, ప్రజా సంక్షేమ పాలనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పని చేస్తున్నారని, గిరి గ్రామాల అభివృద్ధి వేగంగా జరుగుతున్నాయన్నారు. గడప వద్దకే సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, సర్పంచ్‌లు పాండురంగస్వామి, రమేష్, బాబూరావు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మీ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నేతలు జగబందు, జయదేవ్, తిరుపతిరావు, సన్యాసిరావు, దాసు, కొండలరావు, పులిరాజు, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం..మరింత భద్రం

- సందర్శిత ప్రాంతాల్లో హెల్ప్ డెస్క్‌లు
- పర్యాటకుల భద్రత, సౌకర్యార్థం పోలీస్‌శాఖ ఏర్పాట్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న టూరిస్టులు



బొర్రాగుహల వద్ద పోలీసు శాఖ ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకుల సౌకర్యార్థం, భద్రతే లక్ష్యంగా విభిన్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పోలీస్‌శాఖ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారు. పోలీస్‌శాఖలో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.. గతంలోని ఎన్నడూ లేని విధంగా పర్యాటక ప్రాంతాల్లో పోలీస్‌శాఖ హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి, పర్యాటకులు నుంచి మన్ననలను పొందుతున్నారు. అల్లూరి జిల్లాలోని ప్రముఖ సందర్శిత ప్రాంతాలను తిలకించేందుకు, దేశ విదేశాలతో పాటుగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా పర్యాటకులు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలోని వారి భద్రత, ఆనందంగా గడిపేందు కు, వీటిని ఏర్పాటు చేశారు. అరకు, అనంతగిరి, రెండు మండలాల్లో ప్రారంభించారు. అనంతగిరి మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బొర్రాగుహలు, అరకులోయ మండలంలోని ట్రైబల్ మ్యూజియం తదితర కూడలిలో ప్రదేశాల్లో హెల్ప్ డెస్క్‌లు ప్రారంభించారు. వీటిని స్థానిక పోలీస్‌స్టేషన్లకు అనుసంధానం చేశారు. రెండు మండలాల్లో ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులు తాకిడి అధికంగా ఉండడంతో వీటిని ఏర్పాటు చేశారు. పర్యాటకులు భద్రతతో పాటుగా ఆనందంగా గడిపేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి.

భద్రతే లక్ష్యంగా ఏర్పాటు



ప్రముఖ సందర్శిత ప్రాంతాలకు తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. పర్యాటకుల నుంచి మంచి స్పందన ఉందని, వీటితో పాటుగా సందర్శిత ప్రాంతాల్లో పర్యాటకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం.

– కరక రాము, ఎస్ఐ, అనంతగిరి

ఉపాధి పనుల్లో అవకతవకలను తక్షణమే సరిదిద్దాలి



వట్టిగెడ్డలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధి పనుల్లో అవకతవకలు వెలుగు చూస్తున్నాయని, వాటిని 24 గంటల్లో సవరించుకుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఉపాధి హామీ పథకం రాజవొమ్మంగి పీవో, ఎంపీడీవో బాపన్నదొర సంబంధిత సిబ్బందిని హెచ్చరించారు. మర్రిపాలెం, జడ్డంగి, వట్టిగెడ్డ, దూసరపాము గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మస్టర్ షీట్లతో దిద్దుబాట్లు ఉంటున్నాయన్నారు. పనులకు రాని వారి పేర్లు కూడా అటెండన్స్ వేసి ఎన్ఎంఎంఎస్ యాప్‌లో హాజరు వేస్తున్నట్టు గుర్తించామన్నారు. ఒకరి బదులు వేరొకరు పనిచేస్తు తెలిసిందన్నారు. సాంకేతిక సహాయకులు, క్షేత్రస్థాయి సహాయకులు పని ప్రాంతాల్లో అందుబాటులో ఉండడం లేదని, కొలత ప్రకారం మట్టి పనులు జరగడం లేనట్టు గుర్తించామన్నారు. కొంత మంది వేతనదారులు ఉదయం మస్తరు వేయించుకొన్న తరువాత గైర్హాజరు అవుతున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. ఈ లోపాలను వెంటనే సరిదిద్దుకోకపోతే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసు దీప

వై.రామవరం: మండలంలోని చింతకర్రపాలెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సిఐ వై.రాంబాబు ఆదేశాల మేరకు మహిళా పోలీసు పాడియం దీప ఆధ్వర్యంలో శుక్రవారం కిషోర్ బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా చట్టాలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు.దిశయాప్, అట్రాసిటీ, తదితర మహిళా చట్టాలపై కిషోర్ బాలికలకు అవగాహన కల్పించారు. దిశా యాప్‌ను ఉపయోగించుకునే విధానంపై శిక్షణ ఇచ్చారు. బాల్య వివాహాలు జరుగుతుంటే నిలుపుదలచేసి స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాలను గర్భిణులు, బాలింతలు వినియోగించుకోవాలన్నారు. గ్రామంలోని యువతులు, అంగన్‌వాడీ టీచర్ వెంకాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో కూలిన చెట్టు

- నాలుగు గంటలు స్తంభించిన ట్రాఫిక్



పాములేరు వద్ద రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

మారేడుమిల్లి : మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో భారీ వృక్షం కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మారేడుమిల్లి– చింతూరు ఘాట్ రోడ్డులో పాములేరు గ్రామం సమీపంలో భారీ వర్షానికి వృక్షం రోడ్డుపై అడ్డంగా కూలింది. దీంతో నాలుగు గంటల సేపు రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం ఆర్‌అండ్‌బీ సిబ్బంది వాహనాదారులు చెట్టును తొలగించడంతో రాకపోకలు యధావిధిగా సాగాయి.

నేడు యూ.చీడిపాలెంలో ‘గడప గడపకు’

కొయ్యూరు: యూ.చీడిపాలెం పంచాయతీ సంగమవలస, బంగరుబంద, నక్కలమెట్ట, గంగవరం, యర్రగొండ, యూ.చీడిపాలెంలో శనివారం గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పార్టీ నేతలు తెలిపారు. కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పాల్గొంటారని నాయకులు, కార్యకర్తలు, పార్టీ ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

పాఠశాలల్లో వేసవి తరగతులు



వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

డుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని కించుమండ పంచాయతీ కోసంగుడ ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎం విలీయం కేరీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ప్రతి విద్యార్థి కూడా సక్రమంగా చదువుకోవాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు అభ్యసించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఈ వేసవి తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని, తల్లిదండ్రులు ప్రత్యేకమైన దృష్టి సారించి చిన్నారులకు చదివించాలని సూచించారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

హుకుంపేట: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని లైబ్రేరియన్ వి.మానస శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు ఆటల పోటీలు తదితర రంగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. దీంతో విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యం పెంపొందించేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో దోహదపడతాయన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



రాజవొమ్మంగిలో మాట్లాడుతున్న నాయకుడు రామారావు

రాజవొమ్మంగి: కమ్యూనిస్టు పార్టీ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం మండలంలోని చికిలింత పంచాయతీ, లోతట్టు గ్రామం మద్దిబందలలో నిర్వహించారు.ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామారావు అధ్యక్షత సమావేశం జరిగింది. కార్మిక సమస్యలపై సుందరయ్య చేసిన పోరాటాలను గుర్తు చేశారు. నాయకులు పి.రామరాజు, రాజు, పాపారావు, సత్యనారాయణ, జగన్నాథం, చిన్నారావు, రాంబాబు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: సీపీఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని మండలంలోని ఎర్రంపేటలో పార్టీ మండల కార్యదర్శి సీసం సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. శ్రీనివాసరావు, సీతారామయ్య, వెంకట్, లక్ష్మణ్, పెదగయ్య, భారతి, రాములమ్మ పాల్గొన్నారు.

కొయ్యూరు: డౌనూరు పంచాయతీ ముల్లుమెట్టలో సీఐటీయు ఆధ్వర్యంలో సీపీఎం నేత పుచ్చలపల్లి సందరయ్య వర్ధంతి నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొంజన్న, చిట్టన్న, కామేశ్వరరావు, ప్రవీణ్, కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రచార రథంపై శ్రీవారి దర్శనం



ఇందుకూరుపేటలో భక్తులు దర్శించుకుంటున్న శ్రీవారి ప్రచారరథం

దేవీపట్నం: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో రంపచోడవరం మండలం ఐ.పోలవరం వద్ద నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయం ఈ నెల 22న ప్రారంభం కానుంది. ఆలయ ప్రారంభోత్సవానికి సంబంధించి శ్రీవారి ప్రచార రథం గిరిజన గ్రామాల్లో తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఇందుకూరు, ఫజుల్లాబాదు, ఇందుకూరుపేట తదితర గ్రామాల్లో ప్రచార రథంపై శ్రీవారి దర్శనం కల్పిస్తూ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు ప్రచారరథం పై కొలువైన వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వట్టివేగిసలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సోందొర



రేగంలోని వైద్యం శిబిరం నిర్వహిస్తున్న అనంతగిరి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



రింతాడలోలోని వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

జి.మాడుగుల: మండలంలోని గెమ్మెలి పీహెచ్‌సీ పరిధిలోని సొలభం సచివాలయం–2లోని వట్టివేగిన గ్రామంలో డాక్టర్ రొబ్బా సొందోర ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 66 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, ఎంపీహెచ్ఏ(ఎం) లక్ష్మిపతిరాజు, ఏఎన్ఎం శాంతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ భాగ్యదేవి తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని రింతాడ సచివాలయ పరిధిలో ఊబపాలెం గ్రామంలో జీకేవీధి వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సత్యనారాయణ, భాగ్యలక్ష్మి కుమారి తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని అనంతగిరి పంచాయతీ మారుమూల రేగం గ్రామంలోని శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. అనంతగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి రాజాప్రతాప్ ఆధ్వర్యంలోని 86 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులుఅందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఎంపీహెచ్‌ఈవో నర్సింగరావు, పీహెచ్ఎన్ బాలమ్మ, ఏఎన్ఎం గౌరీ తదితరులు పాల్గొన్నారు.

తురాయిపూలు కనువిందు



మన్యంలో తురాయి పూల వికాసం ప్రారంభమైంది. డుంబ్రిగుడ మండలంలోని పర్యాటక ప్రాంతమైన చాపరాయి జలపాతం సేలయేరు సమీపంలోని తురాయి చెట్టుకు నిండా ఎర్రటి పూలు విరగ్గాశాయి. పూల అందాలతో చాపరాయి జలపాతం పర్యాటకులను మరింత ఆకట్టుకుంది.

- సాక్షి, పాడేరు

శ్రమదానంతో రహదారుల నిర్మాణం



వంతాల–రాసపనుకు మధ్య శ్రమదానంతో మట్టి రోడ్డు పనులు చేస్తున్న గ్రామస్తులు



శ్రమదానంతో రహదారిని బాగుచేసుకుంటున్న ఎర్రగట్టు గ్రామస్తులు

జి.మాడుగుల: మండలంలో వంతాల పంచాయతీ కేంద్రం నుంచి రాసపనుకు, పెద్దవలస గ్రామాల మధ్య శ్రమదానంతో స్థానికులు శుక్రవారం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామంలో నాడు–నేడు పథకం ద్వారా పాఠశాల భవనం మంజూరైందని, రోడ్డు సదుపాయం లేకపోవడంతో పనులు జరగడం లేదని పలువురు గ్రామస్తులు చెప్పారు. గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు తెలిపారు. ఈ మేరకు వంతాల–రాసపనుకు, పెదవలస గ్రామాల మధ్య 3.5 కిలోమీటర్లు శ్రమదానంతో మట్టి రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. గ్రామాల మధ్య మిషన్ కనెక్ట్ కింద రోడ్డు మంజూరైన పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని వారు కోరారు.

చిందించిన శ్రమదానం

ఎటపాక: ఎవరో వస్తారు..ఏదో చేస్తారని ఎదురు చూడకుండా రహదారిని శ్రమదానంతో మెరుగుపరచుకున్నారు. మండలంలోని విస్సాపురం పంచాయతీ ఎర్రగట్టు గ్రామంలో ముళ్ల పొదలతో మూసుకుపోతున్న రహదారిని బాగుచేయాలని అధికారులను పలుసార్లు వేడుకున్నారు.

అయినా వారు పట్టించకోకపోవడంతో శుక్రవారం గ్రామస్తులే ఇంటికొకరు చొప్పున స్వచ్ఛందంగా కదిలి వచ్చారు. శ్రమదానంతో ముళ్లపొదలను తొలగించారు. రహదారిలో గోతులను పూడ్చి బాగుచేసుకున్నారు. సాటి గ్రామాల వారికి ఆదర్శంగా నిలిచారు.

ఘనంగా నేస్తాలమ్మతల్లి జాతర

ఎస్.రాయవరం : వమ్మవరం వరహానది ఒడ్డున ఉన్న శ్రీ నేస్తాలమ్మతల్లి జాతర మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రైతుల కల్పవల్లిగా పిలువబడే ఈ అమ్మవారికి గ్రామానికి చెందిన భక్తులతో పాటు రైతులు తమ పొలాల్లో పండిన ఫలాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కుల చెల్లించుకున్నారు. ప్రతి ఏడాది తొలకరి ముందురోజుల్లో అమ్మవారి పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని చెబుతున్నారు.

సకాలంలో స్పందించిన 108 సిబ్బంది



క్షతగాత్రుడికి చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

గంగవరం : మర్రిపాలెం గ్రామానికి చెందిన పల్లాల గోపాల్ రెడ్డి బైకుపై గంగవరం వస్తుండగా జడేరు గ్రామ సమీపంలో ప్రమదానికి గురై య్యాడు. అతని తలకు తీవ్ర గాయాలయ్యా యి. వెంటనే 108కి సమాచారం అందించడంతో ఈఎంటీ రామకృష్ణ, పైలట్ ఎస్‌కేబీ నవాజ్ సకాలంలో స్పందించి గాయాపడిన వారికి ప్రథమ చికిత్స అందించి రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.